క్లుప్తంగా

రెడ్డెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, పరిమళభరిత పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. అమ్మవారికి పెద్ద ఎత్తున భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ మంజుల తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మదనపల్లె రూరల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్.మాధవ్‌ను, మదనపల్లె బీజేపీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత రాష్ట్రపర్యటన రాయలసీమ నుంచి ప్రారంభించేందుకు కడపకు చేరుకున్న మాధవ్‌కు మదనపల్లె నాయకులు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండి ఆనంద్, నారదరెడ్డి, జర్మన్‌రాజు, వెంకటరమణరెడ్డి, పులినరేంద్రరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కార్పొరేట్ స్కూళ్లు


నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మదనపల్లె సిటీ: సెలవులు రోజుల్లో కార్పొరేట్ పాఠశాలలు నిర్వహించడంపై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం మండిపడ్డారు. ఆదివారం స్థానిక మదనపల్లె పట్టణంలోని కార్పొరేట్ పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సమీర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో సార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సుల్తాన్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు

పెనగలూరు : మండలంలోని ఆటో డ్రైవర్లకు ఆదివారం గుర్తింపు కార్డులు పంపిణీ చేసినట్లు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలకు సీరియల్ నెంబర్లు ఇచ్చామని తెలియజేశారు. అలాగే డ్రైవర్‌కు ఫొటోతో కళ్గిన గుర్తింపు కార్డులు అందిస్తున్నామని, ఆ గుర్తింపు కార్డులో డ్రైవర్ల వివరాలు ఉంటాయన్నారు. ఆటో నడిపేటప్పుడు గుర్తింపు కార్డులను తప్పక కలిగి ఉండాలని తెలియజేశారు. అనంతరం డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మల్లూరమ్మకు పూజలు


మల్లూరమ్మను దర్శించుకుంటున్న భక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానదిపై కొలువై ఉన్న శ్రీ మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

సూపర్ సిక్స్ పథకాల్లో ప్రభుత్వం విఫలం


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పీలేరు రూరల్ : సూపర్ సిక్స్ పథకాల్లో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు అన్నారు. సీపీఐ పీలేరు నియోజకవర్గ రెండవ మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి మదనపల్లె మార్గంలోని బోడేషావలి దర్గా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రైతు పెట్టుబడి సహాయం డబ్బులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకం, నెలకు రూ. 1500 ఇస్తామన్న హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలీండర్లు ఇవ్వాలని కోరారు. విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడిన కూటమి నేతలు నేడు అవే తీసుకొచ్చారన్నారు. హంద్రీనీ, గాలేరు – ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. కడప – బెంగళూరు రైల్వే లైను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా ఉద్యమాలపై పోలీసుల ఆంక్షలు మానుకోవాలని కోరారు. ఆగస్టు 10,11,12వ తేదీలలో మదనపల్లెలో జరిగే డివిజన్ స్థాయి రెండో సీపీఐ మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, నియోజక వర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ, నాయకులు వెంకటేష్, నరసింహులు, పి.వి. రమణ, యశోద, శ్రీనివాసులు, రమణ, మహబూబ్ ఆలి, జలాలుద్దీన్ పాల్గొన్నారు.

ఆగస్ట్ 5న జర్నలిస్టుల డిమాండ్స్ డే

– ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గం పిలుపు

మదనపల్లె రూరల్ : రాష్ట్రంలో జర్నలిస్టుల పెండింగ్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆగస్ట్ 5న రాష్ట్రవ్యాప్త డిమాండ్స్ డే పాటించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యవర్గ సమావేశం పిలుపునిచ్చిందని జాతీయ కౌన్సిల్ సభ్యులు బండపల్లె అక్కులప్ప, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వంశీధర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ నియమాల జీఓను వెంటనే విడుదల చేయాలని, పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రిడేషన్లు ఇవ్వాలని రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసిందన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించారన్నారు. అక్రెడిటేషన్ నియమాల జీఓ విడుదలలో జరుగుతున్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఇప్పటికే పాత అక్రిడిటేషన్ల గడువును మూడుసార్లు పొడిగించారని, ఆగస్ట్ నెలాఖరులోగా కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వకపోతే మరోసారి గడువు పొడిగించాల్సి వస్తుందని కార్యవర్గం అభిప్రాయపడిందన్నారు. కొత్త అక్రెడిటేషన్ జారీచేయకపోవడం వల్ల వేలాదిమంది జర్నలిస్టులు హెల్త్‌కార్డ్ సదుపాయాన్ని వినియోగించుకోలేని పరిస్థితి ఎదురవుతోందని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌కార్డ్‌ను వివిధ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో అనుమతించడం లేదని, దీనిపై ప్రభుత్వం తగిన త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాగాన్ని ఏర్పాటుచేయాలని యూనియన్ డిమాండ్ చేసిందన్నారు. గతంలో అమలులో ఉన్న ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలని, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలపై దృష్టి సారించాలని, దాడుల నివారణ కమిటీ ఏర్పాటుచేయాలని యూనియన్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని జర్నలిస్టుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్ట్ 5న రాష్ట్ర వ్యాప్తంగా కోర్కెలదినం పాటించాలని కార్యవర్గం పిలుపునిచ్చిందన్నారు. అన్నమయ్యజిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో జర్నలిస్టులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయా తహసీల్దార్‌లకు ఇవ్వాలని కోరారు.

కళలను ప్రోత్సహించాలి

–ప్రముఖ నవలా రచయిత టీఎస్‌ఏ క్రిష్ణమూర్తి


పురస్కారం అందుకుంటున్న సంగీత దర్శకుడు శంభుప్రసాద్

మదనపల్లె సిటీ: సంస్కృతి, సంప్రదాయాలైన కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఏ.క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని ప్రజాచైతన్య స్రవంతి ఆధ్వర్యంలో భరతముని ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు రొమ్మాల మునికృష్ణారెడ్డి స్మారక ప్రతిభా పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు గుంటూరు శంభుప్రసాద్‌కు ప్రతిభా పురస్కారం అందజేశారు. నేడు కళారంగానికి ఆదరణ తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు ఎంతో మంది కళాకారులు దేశం కోసం, ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు ఎన్నో నాటకాలు వేసినట్లు తెలిపారు. భరతముని ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు మునికృష్ణారెడ్డి కళారంగానికి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. మదనపల్లెకు ఎంతో మంది సినీ కళాకారులతో పాటు ప్రముఖ వ్యక్తులకు రప్పించి అవార్డులను ప్రధానం చేశారన్నారు. నేటి తరం కళారంగాన్ని కాపాడుకోవాలన్నారు. కొంత మంది యువకులు ముందుకు వచ్చి లఘు చిత్రాలను నిర్మిస్తున్నారన్నారు. సందేశాత్మక లఘు చిత్రాలను నిర్మించాలన్నారు. అవార్డు గ్రహీత శంభుప్రసాద్ మాట్లాడుతూ తనకు అవార్డు లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మదనపల్లెలో ఎంతో మంది కళాకారులు వున్నారన్నారు ఇలాంటి గొప్ప పట్టణంలో అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా చైతన్యస్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతి రావు, సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు మునిగోపాల కృష్ణ, చైతన్యభారతి సంపత్‌కుమార్, కామకోటి ప్రసాద్‌రావు, హేమలత, ప్రబాకర్, వీఎం నాగరాజు, అంజలి, వసంతకుమారి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్థాయి మరిచి ఎంపీని విమర్శిస్తే ఊరుకునేది లేదు

– కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి



నిమ్మనపల్లె : రాజంపేట ఎంపీ పీవీ.మిథున్ రెడ్డిని విమర్శించే స్థాయి, అర్హత నిమ్మనపల్లె మండల కూటమి నాయకులకు లేదని, అవాకులు, చెవాకులు పేలితే ఊరుకునేది లేదని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. నిమ్మనపల్లె మండల జనసేన అధ్యక్షుడు ప్రదీప్‌సింగ్, ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై చేసిన విమర్శలను ఖండించారు. వైఎస్సార్ సీపీ నాయకులను రాజకీయంగా ఎదుర్కోలేక, లేని మద్యం స్కామ్‌ను తెరపైకి తీసుకువచ్చి కుట్రపూరితంగా అక్రమ అరెస్ట్ చేశారన్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, అసలు మద్యం స్కామ్‌కు ఆద్యుడు చంద్రబాబేనన్నారు. పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు అక్రమ కేసులతో ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారన్నారు. చిన్న వయస్సులో ఎంపీ మిథున్‌రెడ్డి వరుసగా మూడు పర్యాయాలు రాజంపేట పార్లమెంటరీ సభ్యులుగా విజయకేతనం ఎగురవేసి, రాజకీయ ఉద్ధండులకు సైతం ఓటమి రుచి చూపించారన్నారు. ప్రజలకు సహాయం చేయడంలో, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో మిథున్‌రెడ్డికి ఎవరూ సాటిరారని, అలాంటి నాయకుడిని విమర్శిస్తే సహించేది లేదన్నారు. కూటమిప్రభుత్వ మోసాలు, అరాచకాల్లో భాగస్వామ్యులైన జనసేన పార్టీ నాయకులను ప్రజలు ఛీకొట్టే రోజు దగ్గరలోనే ఉందన్నారు. నిమ్మనపల్లె జనసేన అధ్యక్షుడు ప్రదీప్‌సింగ్ మద్యం, ఇసుక విక్రయాల్లో అక్రమాలకు పాల్పడుతూ, వాటిని కప్పిపుచ్చుకునేందుకు స్థాయి మరచి విమర్శలు చేస్తున్నాడన్నారు. 2029లో వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరికీ సరైన సమాధానం తప్పక చెప్పి తీరుతామన్నారు.

మానవత సేవలను విస్తృతం చేస్తాం


మాట్లాడుతున్న శెట్టిసుబ్రమణ్యం


మాట్లాడుతున్న వైవీ రమణ

పీలేరు : మానవత సంస్థ సేవలు విస్తృతం చేస్తామని సంస్థ చైర్మన్ వి. రామచంద్ర, అధ్యక్షులు శెట్టి సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం మానవత సంస్థ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలకు సిట్టింగ్ బల్లలు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉచిత కంటి వైద్యశిబిరాలు, ప్రభుత్వ పాఠశాల్లో 570కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇవ్వడానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు ఎం. శివనాగయ్య తన భార్య దేవమ్మ జ్ఞాపకార్థం రూ. 5 వేలు విరాళం మానవతా సంస్థకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు జయపాల్‌రెడ్డి, కో–చైర్మన్ కృష్ణమూర్తి, కార్యదర్శి బి. సురేష్, కన్వీనర్ వైవి. రమణ, సభ్యులు తాతయ్య, వెంకటరమణారెడ్డి, పోతంశెట్టి రమేష్, అక్రమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు పెంచాలి


కలకడ : మండలంలో మానవత ఉచిత సేవలను మరింత పెంచాలని ఆ సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులు వైవి రమణ అన్నారు. ఆదివారం కలకడ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆ సంస్థ మండలశాఖ అధ్యక్షుడు పివినాయుడు అధ్యక్షతన నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలకడ, కెవిపల్లె, కలికిరి, గుర్రంకొండ మండలాల్లో అవసరమైన వారికి కేవలం ఫ్రీజర్ బాక్స్‌లు, ఉచిత శాంతిరథం మాత్రం అందించడంతోనే సేవలు ముగించకుండా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మానవత విలువలు పెంచే విధంగా బాధ్యతలను తెలియజేయాలన్నారు. మొక్కల పెంపకం, విశ్రాంతి బల్లలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాంతి మార్గాలను సూచించి, వారు రాణించే రంగాలలో ప్రోత్సహించాలన్నారు. ఆదర్శవంతులను పరిచయం చేయాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీహరి, శ్రీనివాసులురెడ్డి, సయ్యద్‌సాబ్, ఖాజాపీర్. జివి రమణ, పివి రమణ, సంజీవయ్య, సుధాకర, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ విహారకు నిషేధాజ్ఞల వెనుక ఆంతర్యం ఏమిటి?

– బాస్ అధ్యక్షులు పీటీయం.శివప్రసాద్

మదనపల్లె రూరల్ : బుద్ధ విహారకు వెళ్లే దారి మూసివేయడం, బుద్ధుని విగ్రహం చుట్టూ కంచె వేయడం, ఎవరూ వెళ్లకూడదని నిషేధాజ్ఞలు విధించడం, పోలీసు బలగాలతో పహారా ఏర్పాటుచేయడం వెనుక ఆంతర్యమేంటని బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పీటీయం.శివప్రసాద్ ప్రశ్నించారు. ఆదివారం బాస్ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో...చిన్న పిల్లల తప్పిదంతోనే బుద్ధుడి తల విరిగిందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మీడియా సమావేశంలో చెప్పిన మాటల్లో నిజం లేదన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఆరోపించి, తమను అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. బుద్ధుడి తల నరికినోళ్లకు కొమ్ము కాస్తూ భూమికి సంబంధించిన సివిల్ పంచాయతీని తెరపైకి తీసుకువచ్చి తమపై ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. మదనపల్లె చుట్టూ గుళ్లు, చర్చిలు, మసీదులు, దర్గాలు వందకుపైగా ప్రభుత్వ భూముల్లో ఉన్నాయని, వాటికి కంచె వేయగలరా..? సుమారు 5వేల కోట్ల విలువచేసే ప్రభుత్వస్థలాలు ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకోగలరా అని నిలదీశారు. 21 సంవత్సరాల క్రితమే తహసీల్దార్ నుంచి అడ్వాన్స్ పొజిషన్ పొంది బుద్ధవిహారగా నిర్వహిస్తున్న భూమి ఏ విధంగా చెందకుండా పోతుందో ఎస్పీ చెప్పాలన్నారు. ఏ భూమి అయినా 21 సంవత్సరాలు అనుభవంలో ఉంటే, అది వారికే చెందుతుందన్న విషయంపై అవగాహన లేకపోవడం విచారకరమన్నారు. 13–14 ఏళ్ల ఇద్దరు మైనర్ పిల్లలు. అందులో ఒకరికి మతిస్థిమితం లేదు. వాళ్లు ప్రమాదకరమైన మలుపులు ఉన్న రోడ్డు గుండా బుద్ధునికొండపైకి ఎలా వెళ్లి ఉంటారని ఆలోచించకపోవడం దురదృష్టకరమన్నారు. సుమారు రెండువందల కిలోల బరువు ఉన్న విగ్రహం ఎలాంటి ఆయుధాలు, పనిముట్లు లేకుండా పిల్లలు కిందకు తోసేయగలరా..? సిమెంట్, ఇసుక, కంకర, కమ్మీలతో చేసిన మోల్డ్ విగ్రహం, మతి స్థిమితంలేని ఒక పిల్లవాడు ఆటలాడితే విరిగిపోతుందా..? విరిగిపోయిన తలను పిల్లవాడు తీసుకువచ్చి బుద్ధుడి చేతుల్లో పెట్టి, అది పడిపోకుండా చుట్టూ రాళ్లు పెట్టగలడా..? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పాలన్నారు. 20 రోజుల విచారణ పేరుతో పోలీసులు ఏం సాధించారో తెలియడం లేదన్నారు. తమది ఆత్మగౌరవ పోరాటమని, చలో మదనపల్లెకు అనుమతి ఇవ్వాల్సిన బాధ్యత ఎస్పీపై ఉందన్నారు. చలో మదనపల్లె ఎట్టి పరిస్థితుల్లోనూ జరిపి తీరుతామని, బౌద్ధులు, బౌద్ధాభిమానులు, అంబేడ్కరీయులు, వామపక్ష, ప్రగతిశీల, ప్రజాస్వామికవాదులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

మయూరం ఠీవి


రాయిపై ఠీవిగా ఉన్న నెమలి

మదనపల్లె సిటీ: అటవీ ప్రాంతాల్లోని నెమళ్లు సమీప గ్రామాల్లోని పొలాల్లో సందడి చేస్తున్నాయి. మేత కోసం ఉదయమే గుంపులు,గుంపులుగా వస్తున్నాయి. మదనపల్లె మండలం కోళ్లబైలు గ్రామంలో ఓ మయూరం రాయిపై ఠీవిగా కూర్చున్న దృశ్యాన్ని వెల్‌విషర్స్ ట్రెక్కింగ్ సభ్యులు కెమరాలో బంధించారు. మయూరాల విన్యాసాలను చూసి ఆనందిస్తున్నారు.

జిల్లా ఆస్పతిలో గొడవపై స్పందించిన పోలీసులు

మదనపల్లె రూరల్: ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి మద్యం మత్తులో అంబులెన్స్ యజమాని వీరంగం సృష్టించి, మరో అంబులెన్స్ డ్రైవర్ రవితో పాటు అతని స్నేహితుడు రెడ్డిపై దాడి చేసి దౌర్జన్యానికి దిగిన ఘటనపై ఆదివారం పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో టు టౌన్ పోలీసులు స్పందించారు. టు టౌన్ సీఐ రామచంద్ర ఆదేశాలతో ఏఎస్ఐ రమణ ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లను పిలిపించి వివరాలు సేకరించారు. మద్యం మత్తులో జరిగిన గొడవపై వివరాలు సేకరించారు. అంబులెన్స్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం అంబులెన్స్ డ్రైవర్లు మరోసారి పోలీసు స్టేషన్ వద్ద హాజరు కావాలని ఆదేశించారు. ఆస్పత్రి ప్రహరీ పక్కన ట్రాఫిక్ ఇబ్బందికరంగా ప్రైవేటు అంబులెన్స్ వాహనాలను ఉంచకూడదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా అంబులెన్సు వాహనాలను ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో కాని ఆస్పత్రి ఎదుట ట్రాఫిక్‌కు అడ్డుగా గాని ఉంచితే జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాత్రి వేళల్లో ఆస్పత్రి ప్రాంగణంలో మద్యం సేవించి గొడవలు పడితే ఉపేక్షించేది లేదన్నారు. నూతన డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్దకు ఇతరులు వెళ్లకుండా ముళ్లకంపలు అడ్డుగా వేయించారు. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి గొడవలు నివారించాలని ఆదేశించారు. అంతే కాకుండా ప్రైవేటు అంబులెన్స్ వాహనాలు నిలిపి ఉంచకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అయితే పగలంతా పోలీసు ఆదేశాలు పాటించిన అంబులెన్స్ వాహనాల డ్రైవర్లు సాయంత్రానికి పోలీసు ఆదేశాలను పెడచెవిన పెట్టి వాహనాలను ఆస్పత్రి ఎదుట పార్కింగ్ చేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అక్రమమని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం రాత్రి తిరుపతిలోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వగృహంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ జరగని లిక్కర్ స్కామ్‌పై అక్రమంగా కేసు బనాయించడం, అరెస్టు చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా నిరసనలకు దిగుతున్నారని మాజీ మంత్రితో అన్నారు. ఎంపీ అరెస్టుకు నిరసనగా శాంతియుత ర్యాలీలు చేపట్టినా కూటమి ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై నిలిచి కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలు, అరాచకాలను ఎదుర్కోవాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి సూచించినట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట కలికిరి మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్ రెడ్డి, మహేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

కంటి రోగులకు ఆపరేషన్లు

రాయచోటి జగదాంబసెంటర్ : పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 19 మంది రోగులకు ఆపరేషన్లు నిర్వహించినట్లు కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూప గుప్తా తెలిపారు. రాయచోటి నియోజకవర్గంతో పాటు అన్నమయ్య, కడప జిల్లాలకు చెందిన 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 19 మంది కంటి రోగులకు పరీక్షలు ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేషబాబు, భార్గవి, అప్తాలమిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్‌కలామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


కలామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వెల్‌విషర్స్ సభ్యులు


అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మదనపల్లె సిటీ: యువత అబ్దుల్‌కలామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వెల్‌విషర్స్ వ్యవస్థాపకులు ఎస్.గిరీష్ అన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలామ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన విద్యార్థులను అమితంగా ఇష్టపడేవారన్నారు. పేద కుటుంబంలో జన్మించి తన కృషి, అపార మేథోసంపత్తితో అత్యుతన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. భారత ప్రభుత్వం భారతరత్న అత్యుత్తమ పురస్కారం అందజేసిందన్నారు.కార్యక్రమంలో సాయి చిత్ర భాస్కర్‌నాయుడు, లక్ష్మిపతి, వినయ్, భాను ప్రకాష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి

గుర్రంకొండ : భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం దేశానికి ఒక దిక్సూచిగా వ్యవహరించారని కొనియాడారు. ఎంతో మంది విద్యార్థులకు, ప్రజలకు విజ్ఞానం అందించడం ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.కె. బాష, ఫైరోజ్‌ఖాన్, సయ్యద్ హుజైతుల్లా, షమీరు, రోజ్‌బాషా పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గూడరేవుపల్లె బ్రిడ్జి


ప్రమాదకరంగా ఉన్న గూడరేవుపల్లె బ్రిడ్జి

పీలేరు రూరల్ : మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ పీలేరు – తలపుల రోడ్డులో గూడరేవుపల్లె సమీపంలో ఉన్న వంకపై బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. గతంలో కురిసిన వర్షాలకు బ్రిడ్జి పాక్షికంగా దెబ్బతింది. ఇదే బ్రిడ్జి వద్ద ఆటోలు అదుపు తప్పి వాగులోపడి కొట్టుకు పోయాయి. ఇద్దరు వ్యక్తులు కూడా మృతి చెందిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు ప్రవహించడంతో బ్రిడ్జి కింద నీరునిల్వ ఉంది. ఈ బ్రిడ్జిపై వాహనదారులు ప్రాణం అరచేతిగుప్పిట్లో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ వాహనాలు నడుపుతున్నారు. ఈ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్తగా బ్రిడ్జి నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత



సుండుపల్లె : మండల పరిధిలోని గుల్లావాండ్లపల్లెకు చెందిన జ్యోతి(16) అనే అమ్మాయి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరు సెయింట్ జాన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఆ అమ్మాయి చికిత్సకు దాదాపు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని హాస్పిటల్ వారు చెప్పారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మానవత సంస్థ వారు చైర్మన్ గంగిరెడ్డి రూ.10 వేలు, సంస్థ సభ్యులు మొత్తం కలిపి రూ.17 వేలు అమ్మాయికి నగదు రూపంలో చికిత్స కోసం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మేడికుర్తి జెడ్పీ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కలికిరి: మండలంలోని మేడికుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1995–96 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. 30సంవత్సరాల తరువాత పాఠశాలలో పూర్వ విద్యార్థులు కలుసుకోవడంతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. అప్పటి గురువులు ఆనందరెడ్డి, లక్ష్మిరెడ్డి, బసవయ్య, వెంకటరమణా రెడ్డి లను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి గాను పాఠశాల ప్రధాన గేటు ఏర్పాటుకు పూర్వ విద్యార్థులు ముందుకువచ్చారు. అలాగే పాఠశాలలో అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో తీసుకువస్తామన్నారు.